ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

మంగళవారం 31 డిసెంబరు 2024



డీజేలకు అనుమతి లేదు

» ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రిసార్ట్స్ ఫాంహౌస్‌లలో పెద్ద శబ్ధాలు చేసే డీజేలు, సౌండ్ బాక్సులకు అనుమతులు ఇవ్వలేదన్నారు. రిసార్ట్స్ ఫాంహౌస్‌లను ప్రత్యేక నిఘా బృందాలు పర్యవేక్షిస్తుంటాయన్నారు. మద్యం తాగి డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వాహనాలపై తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా పెట్రోలింగ్, నాకాబందీ ఉంటుందన్నారు.



సిద్ధం చేసిన బోటింగ్ పాయింట్



వేడుకలకు సిద్ధం చేసిన కేకులు

నయా జోష్!

కొత్త సంవత్సర వేడుకలకు అంతా సిద్ధం

రిసార్ట్స్, ఫాంహౌస్‌ల్లో భారీగా ఏర్పాట్లు

వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త సంవత్సరం వేడుకలకు సర్వం సిద్ధమవుతోంది. కొత్త, కొత్త ఈవెంట్లతో యువతరాన్ని ఆకట్టుకునే విధంగా రిసార్ట్స్, ఫాంహౌస్‌లు సిద్ధమవుతున్నాయి. ఆన్‌లైన్‌లో బుకింగ్ సదుపాయం కల్పించడంతో ఇప్పటికే అన్ని రిసార్ట్స్‌ల్లో బుకింగ్‌లు పూర్తయ్యాయి. రిసార్ట్స్‌ల్లో ట్రెక్కింగ్, నైట్ క్యాంపింగ్, అడ్వంచర్ గేమ్స్, లైవ్ సింగింగ్, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ రిసార్ట్స్‌ల్లో ముంబాయి, బెంగళూరు, హైదరాబాద్ నుంచి సింగర్స్, డ్యాన్సర్లను రప్పిస్తున్నట్లు తెలుస్తోంది.

కాటేజీలోకి ఇద్దరికే అనుమతి

వికారాబాద్ జిల్లా కేంద్రం పరిసరాల్లో 10 రిసార్ట్స్, 30 వరకు ఫాంహౌస్‌లు ఉంటాయి. న్యూ ఈయర్ వేడుకలకు డిమాండ్ పెరగడంతో నిర్వాహకులు ఎంట్రీ ఫీజు పెంచేశారు. సాధారణంగా వారాంతాల్లో ఒక్కొక్కరికీ రూ. 2 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తుండగా, ఇప్పుడు రూ.3 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచారు. టెంట్ కాటేజీ, క్యాంపింగ్ కాటేజ్, ఉడెన్ కాటేజ్‌కు వేర్వేరుగా చార్జీ చేస్తున్నారు. వీటిల్లోకి ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుంది. అనంతగిరిలోని హరిత రిసార్ట్స్ కూడా న్యూఈయర్ వేడుకలకు సిద్ధమైంది.

రూ.లక్షకుపైగా టిక్కెట్ ధరలు

నూతన సంవత్సర వేడుకలకు సంపన్న వర్గాలు భారీ ఖర్చులకు వెనుకాడడం లేదు. వీరిని దృష్టిలో పెట్టుకుని కొన్ని హోటళ్లు, రిసార్ట్‌ల యాజమాన్యాలు ఆర్భాటంగా న్యూఈయర్ వేడుకలు నిర్వహిస్తున్నాయి. ఇక్కడ టిక్కెట్ ధరలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. మాదాపూర్ రెడ్ రిహినోలో డీజే అభిలాష్ కార్యక్రమానికి రూ.5,499 నుంచి గరిష్ఠంగా టిక్కెట్ ధర రూ. 1,50,000గా నిర్ణయించారు. గచ్చిబౌలిలో హార్ట్ కప్ కాఫీ 'ఎరా2' పేరుతో నిర్వహిస్తున్న మ్యూజిక్ పార్టీకి టిక్కెట్ ధర రూ.2,499 నుంచి రూ1,00,000 నిర్ణయించారు. ప్రఖ్యాత సింగర్స్ జెమ్మర్, డీజే కార్నివోర్ పాల్గొంటున్నారు. దుర్గం చెరువ వద్ద బీచ్ థీమ్ పార్టీకి గరిష్ఠంగా రూ. 45వేల టిక్కెట్ ధర ఉంది. శామీర్‌పేటలోని లియోనియో రిసార్ట్ లో రూమ్‌ల ధరలు ధర గరిష్ఠంగా రూ. 34,999గా నిర్ణయించారు. అలాగే ప్రగతి రిసార్ట్‌లో కూడా న్యూఈయర్ ప్యాకేజీలు ఉన్నాయి. ఇక్కడ కూడా రూమ్‌లకు గరిష్ఠంగా రూ. 25వేల వరకు ప్యాకేజీలు పెట్టారు.



ఓ రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన ఉడెన్ కాటేజీలు

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

రూ.91 లక్షలతో హాస్టళ్లు, పాఠశాలల్లో మరమ్మతులు

తక్కువ వ్యయంతో ఎక్కువ సదుపాయాలు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్య, ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగుపడేలా పర్యవేక్షణ పెంచామన్నారు. 187 మంది ఎఫ్ఎల్ఎన్ మెంటార్స్ సేవలను వినియోగించుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన మెరుగుపడేలా చర్యలు చేపట్టామని, దీనికోసం 5 స్వచ్ఛంధ సంస్థల సేవలను వినియోగించుకున్నట్లు వివరించారు. తీవ్ర అనారోగ్య పరిస్థితులను ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులకు మినహా ఇతరులు ఎవరికీ డిప్యూటేషన్ ఇవ్వలేదని స్పష్టం చేశారు.

డిస్పెన్సరీలుగా పీహెచ్‌సీలంటూ అసంతృప్తి

జిల్లాలో వసతి గృహాలు, గురుకుల, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రూ.91 లక్షలు వెచ్చించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 1,997 ఫ్యాన్లు, 304 హ్యాలోజెన్ లైట్లు, 1,786 ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయగా, ఇంకా 353 ఫ్యాన్లు, 166 హ్యాలోజెన్ లైట్లు, 514 ట్యూబ్‌లైట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పాఠశాలలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. మరమ్మతు పనులను ఇంజనీర్లకు అప్పగించకుండా మేస్త్రీలతో తక్కువ వ్యయంతో సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇదిలా ఉంటే, జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు డిస్పెన్సరీలుగా మారాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు చేయడంలేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా స్పందించారు. పీహెచ్‌సీల పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, వారికి నాణ్యత కలిగిన పోషకాహారం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శాలువాలు.. బొకేలు తీసుకురావద్దు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తనను కలిసేందుకు వచ్చే అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది శాలువాలు, ఫ్లవర్ బొకేలు తీసుకురావద్దని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. వాటికి బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటి స్టడీ మెటీరియల్ తీసుకు వస్తే సంతోషపడతానని తెలిపారు.



బదిలీల్లో బేరసారాలు!

జీవో 317 బదిలీల్లో మ్యూచువల్‌కు తీవ్ర పోటీ

ఉపాధ్యాయ మ్యూచువల్ బదిలీల్లో పెద్ద ఎత్తున బేరసారాలు సాగుతున్నాయి. రూ.లక్షల్లో చేతులు మారే విధంగా ఒప్పందాలు చేసుకుంటున్నారు. రెండేళ్ల తర్వాత లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సొంత ప్రాంతాలకు వెళ్లాలని పలువురు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. మ్యూచువల్ బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 4 నుంచి 31వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దరఖాస్తుకు నేడు ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో తమకు సరిపోయే మ్యూచువల్ ఉపాధ్యాయులను వెతుక్కునే ప్రక్రియలో ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.



వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జీవో 317 కారణంగా తమ నివాస ప్రాంతాలకు దూరంగా ఉండే జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులు ఈ మ్యూచువల్ బదిలీలతో తమ సొంత జిల్లాకు వెళ్లేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా ఉపాధ్యాయులు తమకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. జిల్లాలో పనిచేస్తున్న కొందరు ఉపాధ్యాయులు జీహెచ్‌ఎంసీ పరిధిలో 24 శాతం హెచ్‌ఆర్‌ఏ పాఠశాలల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో పనిచేస్తున్న వికారాబాద్ జిల్లా ఉపాధ్యాయులు గుడ్‌విల్ తీసుకొని వికారాబాద్ జిల్లాకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. వ్యక్తిగత కారణాలతో కొందరు ప్రయత్నిస్తుండగా, ఎక్కువ శాతం పైగా గుడ్‌విల్ కోసమేనన్న ప్రచారం ఉపాధ్యాయవర్గాల్లో జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మ్యూచువల్ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుందనే ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో తమ పేరు, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ (సబ్జెక్టు), లాంగ్వేజ్ పండితులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీల్లో ఎవరనేది, ఏ మండలంలో ఏ పాఠశాలలో

మిగతా 8వ పేజీలో...

మ్యూచువల్ బదిలీలపై జిల్లాలు మారే ఉపాధ్యాయులకు సర్వీస్‌కు రక్షణ లేదు. ఈ జిల్లా నుంచి కొత్త జిల్లాలకు వెళ్లినా.. అక్కడి నుంచి ఇక్కడకు వచ్చే ఉపాధ్యాయులు తమ పాత సర్వీసును కోల్పోనున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కేడర్‌లో ఉన్న సర్వీసును కొత్త జిల్లాలకు బదిలీ కాగానే ఆ కేడర్‌లో జూనియర్‌గా తమ ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది. సర్వీసు కోల్పోయే ఉపాధ్యాయుల్లో జిల్లా నుంచి రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు వెళ్లే వారికి అంతగా నష్టం జరగకున్నా.. ఆ జిల్లాల నుంచి వికారాబాద్ జిల్లాకు వచ్చే ఉపాధ్యాయులకు పదోన్నతుల విషయంలో నష్టం జరగనుంది. అక్కడ తాము ఉద్యోగ విరమణ వరకు తమకు వచ్చే హెచ్‌ఆర్‌ఏతో పాటు పదోన్నతులను కోల్పోవాల్సి వస్తుందని ఆ రెండు జిల్లాల నుంచి వచ్చే ఉపాధ్యాయులు ఎక్కువ గుడ్‌విల్ తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మ్యూచువల్ బదిలీ అవకాశం సద్వినియోగం చేసుకుని ఈ జిల్లా నుంచి వెళ్లకపోతే ఉద్యోగ విరమణ చేసే వరకు అదే జిల్లాలో కొనసాగాల్సి వస్తుందన్న ఆశ వారిని ఎంత ఖర్చయినా పరవాలేదనేలా చేస్తోంది. తాము కోరుకున్న జిల్లాకు, మండలాలకు, పాఠశాలలకు వెళ్లాలనే మొండి పట్టుదల వారి ప్రయత్నాలను తీవ్రతరం చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది. భవిష్యత్తులో తమ పిల్లల ఉన్నత చదువులు, కుటుంబ అవసరాల మేరకు ఈ రెండు జిల్లాలకు వెళ్లడానికి ఉపాధ్యాయులు ఆసక్తి కనబరుస్తున్నట్లు చెబుతున్నారు.

కోల్పోనున్న పాత సర్వీస్

డీఈఈసెట్ వెబ్ ఆప్షన్లకు మరో అవకాశం

వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో డీఈఈ సెట్ 2024-26లో రెండు సంవత్సరాల కోర్సులో ప్రవేశానికి సంబంధించి వెబ్ ఆప్షన్లకు మరో అవకాశం కల్పించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో విడతల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. సీట్ల కేటాయింపు జనవరి 8న జరగనుందని, జనవరి 9 నుంచి 13 వరకు ఫీజు చెల్లించి అలాట్మెంట్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.



ఎర్రమట్టి గుంతలను పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ, ఆర్ఐ

ఎర్రమట్టి తరలించే వారిపై చర్యలు

వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మైనింగ్ ఏడీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గిరిగేట్‌పల్లిలో ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆంధ్రజ్యోతిలో 'కొండను పిండేస్తున్నారు' అనే శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ జరిగిన తవ్వకాలను పరిశీలించి లావణి భూమికి సంబంధించిన రైతులకు నోటీసులు అందించి, ఎర్రమట్టి తవ్విన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మట్టి తవ్వకాలపై వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణతో మట్లాడుతామన్నారు. వెంటనే అవసరమైన చర్యలు చేపట్టి ఇకముందు ఎర్రమట్టి తవ్వకాలు జరగకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట మైనింగ్ ఆర్ఐ నిర్మల తదితరులు ఉన్నారు.



ఇష్టారాజ్యం!

సమయపాలన పాటించని పలువురు అధికారులు

అడిగితే ఫీల్డ్‌కు వెళ్లారంటూ సమాధానాలు

అమల్లోకి రాని 'బయోమెట్రిక్'

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో దుస్థితి

7



కొడంగల్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

రూ.10కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన

6

పంట భూములను సేకరించొద్దు

» కేంద్ర భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



రైతు సదస్సులో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

బొంరాస్‌పేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం సాగు భూములను సేకరించడం సరైంది కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం దుద్యాల మండలంలోని హకీంపేట్ చౌరస్తాలో రైతు సదస్సు నిర్వహించారు. సదస్సుకు భూములు కోల్పోతున్న రైతులతో పాటు వామపక్ష పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వాలు పేదల పక్షాన నిలవాలన్నారు. చిన్న, సన్న కారు రైతులకు జీవనధారమైన రెండు పంటలు పండించే భూములను సేకరించడం సమంజసం కాదన్నారు. గతంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల పక్షాన వచ్చి వామపక్ష పార్టీలు పోరాటం చేయడంతో ఫార్మా సిటీ ఏర్పాటుపై వెనక్కి తగ్గి ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు ప్రక్రియ ముందుకు వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ సేకరణ చట్టం ప్రకారం సాగుకు అనువుగా లేని భూములను మాత్రమే సేకరించాలన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం కొడంగల్ ప్రాంతంలో 1,130 ఎకరాల భూములను సేకరించాలన్నారు. భూముల కోసం అప్పట్లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు జాన్‌వెస్లీ, నర్సింహారావు, ఆర్.వెంకట్రాములు, మహిపాల్, యం.వెంకటయ్య, బుస్స చంద్రయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, బుగ్గప్ప, సుదర్శన్, సతీశ్, నర్సమ్మ, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థినుల భవిష్యత్తుకే కళాశాల తరలింపు

గురుకుల విద్యాలయాల సంస్థ సంయుక్త కార్యదర్శి శారద



కళాశాలలో జిమ్‌ను పరిశీలిస్తున్న కార్యదర్శి శారద

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల భవిష్యత్తు కోసమే తెలంగాణ సాంఘిక సంక్షేమ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రీపరేటరీ డిగ్రీ కళాశాలను బీబీనగర్ మండలం, లక్ష్మీదేవిగూడ నుంచి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుశాపూర్‌కు తరలించినట్లు గురుకుల విద్యాలయాల సంస్థ సంయుక్త కార్యదర్శి శారద తెలిపారు. సోమవారం ఆమె ఆ కళాశాలలో జిమ్, కంప్యూటర్ శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నూతన ప్రాంగణంలో మహేంద్ర హిల్స్, బుద్వేల్, ఇబ్రహీంపట్నం, జగద్గిరిగుట్టకు సంబంధించిన కళాశాలలో దాదాపు 2 వేల మంది విద్యార్థులున్నారని తెలిపారు. మాజీ ఆర్మీ అధికారులతో ఇక్కడ ఆర్మీ శిక్షణ ఉంటుందని తెలిపారు. దేశభక్తి ఉన్న విద్యార్థినిలు ఆర్మీలో చేరాలనుకునే వారికి ఇది మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఓఎస్‌డీ శర్మ, ప్రిన్సిపాళ్లు స్నేహలత, నిరూప, రాధిక, శ్రీప్రియా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

వికారాబాద్/దౌల్తాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు పడిందని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దాసరి గోవిందు తన కూతురిపై లైంగికదాడికి పాల్పడిన అభియోగంతో అప్పటి ఎస్ఐ రమేశ్, పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈనేపథ్యంలో జిల్లాలోని దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితుడు గోవిందు వికారాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి చంద్రకిషోర్ సోమవారం గోవింద్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.1.50లక్షల జరిమానా విధించారని ఎస్పీ తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధించారని చెప్పారు. ఈ కేసులో పీపీలు రాజేశ్వర్, మెరాజ్ ఫిర్దౌస్, మొదటి ఐవో తోట సుబ్రహ్మణ్యం, రెండో ఐవో వి.రమేష్, ఐవో కరుణసాగర్‌రెడ్డి, ప్రస్తుత ఎస్‌హెచ్‌వో రవిగౌడ్, సీఐ శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, సీడీవో సురేష్‌గౌడ్, బ్రీఫింగ్ ఆఫీసర్, కోర్టు లైజన్ ఆఫీసర్ నిరంజన్‌గౌడ్, బాధితురాలు బ్రీఫింగ్ అధికారి కీర్తి ఆకుల అనుసంధాన అధికారులు వీరన్న, నిరంజన్‌గౌడ్‌లు ఉన్నారని ఇట్టి అధికారులను ఎస్పీ అభినందించారు. ఈ కేసులో బాధితులకు డీఎల్ఎస్ఏ డిస్ట్రిక్ట్‌లీగల్ సర్వీస్‌అథారిటీ ద్వారా రూ.4లక్షలు అందించాలని ఎస్పీ ఆదేశించారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో మేడ్చల్ యువతికి స్వర్ణం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో మేడ్చల్‌కు చెందిన కత్తిప్రసన్న స్వర్ణ పతకం సాధించింది. దీంతో సోమవారం ప్రసన్నను మేడ్చల్ నియోజకవర్గ ఏబ్లాక్ అధ్యక్షుడు పానగంటి మహేష్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసన్న చిన్న వయస్సులోనే అంతర్జాతీయ స్థాయిలో రెండుసార్లు త్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించినట్లు గుర్తుచేశారు. మేడ్చల్ పేరును అంతర్జాతీయ స్థాయి వరకు ప్రసన్న తీసుకెళ్లిందన్నారు. ఆమె తెలంగాణ రాష్ట్ర త్రో బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. మేడ్చల్‌కు చెందిన పలువురు నాయకులు, తోటి క్రీడాకారులు ఆమెను అభినందించారు.



త్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన కత్తి ప్రసన్న

కొడంగల్ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి
- పట్టణంలో రూ.10కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన

కొడంగల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. కొడంగల్ పట్టణంలోని పలు వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు మంజూరైన రూ.10కోట్లతో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, రాజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.


కొడంగల్: పనులకు శంకుస్థాపన చేస్తున్న తిరుపతిరెడ్డి, నాయకులు

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కొడంగల్/బొంరాస్‌పేట్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక కడా కార్యాలయంలో సోమవారం కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్, అప్పాయిపల్లి, చిన్ననందిగామ, చిట్లపల్లి, ఇందనూర్, కొడంగల్, నాగారం, పర్సాపూర్, పెద్దనందిగామ, రావుల్‌పల్లి, రుద్రారం, టేకుల్‌కోడ్, ఉడిమేశ్వరం, ఉప్పర్‌పల్లి గ్రామాలకు చెందిన 98 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌గుప్త, ఉషారాణి, ప్రశాంత్ పాల్గొన్నారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండలంలో 55 మంది, దుద్యాల మండలంలో 94 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖర్, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ

కొడంగల్ పట్టణ శివారులోని బండెల ఎల్లమ్మ ఆలయ సమీపంలో అయ్యప్పసేవా సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త తదితరులు పడి పూజలో పాల్గొన్నారు.

మద్యం నేరాలపై నిరంతర నిఘా

- 2024లో జిల్లాలో 888 కేసులు, 350 మంది అరెస్టు
- గుడుంబా రహిత జిల్లాగా చేయడమే లక్ష్యం
- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్



వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మద్యం సంబంధిత నేరాలపై నిఘా పెట్టినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. వికారాబాద్‌ను గుడుంబా రహిత జిల్లాగా ఉంచడంలో ఎక్సైజ్ శాఖ నిరంతర కృషి చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో 2024 సంవత్సరంలో 888 కేసులను నమోదు చేసి 350 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీ, సరఫరాకు సంబంధించి ఈ ఏడాది 354 కేసులు నమోదు కాగా 184 మంది వ్యక్తులను అరెస్టు చేసి పది వాహనాలను సీజ్ చేశామన్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా కల్లు విక్రయాలకు సంబంధించి 142 కేసులు నమోదు చేసి 36 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిని గుర్తించి 119 కేసులు నమోదు చేశామని, 86 మంది వ్యక్తులను అరెస్ట్ చేశామని చెప్పారు. కల్లు అమ్మే వ్యక్తులను గుర్తించి దాదాపు 142 కేసులను నమోదు చేశామని, 36 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆరు కల్తీకల్లు కేసులు నమోదయ్యాయన్నారు. అదేవిధంగా జిల్లాలో 21 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేస్తూ 26 మందిని అరెస్ట్ చేశామన్నారు. 165 కేజీల గంజాయిని పట్టుకోవడమే కాకుండా, గంజాయి సరఫరాకు వినియోగిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా 20 ఎన్‌డీపీఎల్ కేసులు నమోదు చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. 474 లీటర్ల ఎన్‌డీపీఎల్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో 2023లో కేవలం 62 ఈవెంట్స్ మాత్రమే పర్మిషన్ తీసుకోగా 2024లో ఏకంగా 258 ఈవెంట్స్‌కి పర్మిషన్ కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. మన జిల్లా మద్యం అమ్మకాల్లోనూ వృద్ధి నమోదైందన్నారు. గత సంవత్సరం దాదాపు రూ.668కోట్లు విలువ గల మద్యం అమ్మకాలు జరగగా ఈ ఏడాది దాదాపు రూ.728 కోట్లుగా నమోదైందన్నారు.

ప్రజల ఆరోగ్యంతో ఆటలా?

బీజేపీ ధార్మిక సెల్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి


మద్యం జీవోను తగలబెడుతున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం న్యూయర్ సందర్భంగా మద్యం జీవోలను తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతోందని బీజేపీ ధార్మికసెల్ ఇన్‌చార్జి కొప్పుల రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన మద్యం జీవోను వ్యతిరేకిస్తూ వినతిపత్రం ఇచ్చి ప్రభుత్వ జీవో ప్రతులను కార్యాలయం ఎదుట దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకోవడమే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యానికి హాని తలపెట్టే చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం మరోసారి ఆలోచించి జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతగిరి ఆలయం చుట్టు పక్కల పరిసర ప్రాంతాలలో ఫారెస్ట్‌లో యువకులు మద్యం తాగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అనంతగిరి చుట్టు పక్కల అనుమతులు లేని రిసార్ట్స్ చాలా వెలిశాయన్నారు. వాటిలో కూడా మద్యం, గంజాయి వాడకం జరుగుతుందని వీటిపైన ఎక్సైజ్ శాఖ, పోలీస్‌శాఖ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ మెంబర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సుధాకర్ ఆచారి, ప్యాట శంకర్, యాదగిరి, శివరాజు, ధార్మిక్ సెల్ కన్వీనర్ మోహన్ రెడ్డి, జాయింట్ కన్వీనర్ రాఘవేందర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయుల ఆనవాళ్లను పరిరక్షించాలి


పంటపొలాల్లో లభ్యమైన నంది విగ్రహం

కొత్తూర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి ఆనవాళ్లను పరిరక్షించుకోవాలని పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి స్థానికులకు సూచించారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ హనుమాన్ దేవాలయ పరిసరాల్లోని పంట పొలాల్లో ఇటీవల బయటపడిన శివ లింగం, నంది విగ్రహాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. హనుమాన్ దేవాలయ పరిసరాల్లోని పంటపొలాల్లో శివలింగంతో పాటు, నంది విగ్రహం బయటపడడంతో నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పట్నం కృష్ణం రాజు పురావస్తు శాఖకు సమాచారం అందించారు. దాంతో శివనాగిరెడ్డి స్థానిక కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్‌తో కలిసి శివలింగం, నందివిగ్రహాన్ని పరిశీలించి, స్థానికులకు పలు సూచనలు చేశారు. కాగా, అవి 13వ శతాబ్దం నాటివని శివనాగిరెడ్డి చెప్పారు. రెండు విగ్రహాలను హనుమాన్ దేవాలయంలో భద్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అమడపురం నర్సింహగౌడ్, కోస్గి యాదయ్య, ప్రకాష్‌గౌడ్, హరీష్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, చింతకింది నర్సింహగౌడ్, పాండుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీని రద్దు చేసే వరకూ పోరాటం


తాటిపర్తిలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న సరస్వతి

యాచారం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో విషపూరితమైన ఫార్మాసిటీని ఏర్పాటు చేయొద్దని, దానిని రద్దు చేసేదాకా తాము పోరాటం ఆపేది లేదని ఫార్మాసిటీ బాధిత పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి అన్నారు. కాంగ్రెస్ పాలకులు జనాలను మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని తాటిపర్తిలో బాధిత రైతులతో సమావేశమై మాట్లాడారు. ఫార్మాసిటీ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు మాట ఇచ్చి.. అధికారంలోకి రాగానే మళ్లీ ఏర్పాటుకు ఎందుకు పూనుకుంటున్నారని ప్రశ్నించారు. పచ్చటి పంట పొలాల మధ్య ఫార్మాసిటీ నెలకొల్పి వాతావరణాన్ని విషతుల్యం చేయడం ఎందుకని ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో ఉన్న రైతుల పట్టా భూములను వెంటనే తొలగించాలని కోరారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నిరంజన్, బుచ్చిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, బాలకృష్ణ, సోమయ్య, బాల్లయ్య, అంజమ్మ, చెన్నయ్య తదితరులున్నారు. కాగా, ఇకనుంచి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా పోలీసుల అనుమతి విధిగా తీసుకోవాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు బాధిత రైతులకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. తాటిపర్తి గ్రామంలో ఆందోళనకారులతో వారు మాట్లాడారు. ర్యాలీలు, సభలు పెట్టుకోవడానికి అనుమతి తీసుకోవాలని, లేకపోతే అడ్డుకుంటామని సూచించారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరిస్తాం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చేవెళ్ల, డిసెంబరు 30(ఆంధ్ర జ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా పరిష్కరిస్తామని ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 25 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇందులో చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. ఆర్డీవో కార్యాలయం ఏవో రాజశేఖర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచానికి పరిమితమైన దివ్యాంగులకు 'సదరం' అందివ్వాలి



ఎంపీడీవోతో కలిసి వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్యత్వంతో కదలలేని స్థితిలో ఉన్నవారికి ఎంపీడీవో నివేదిక ఆధారంగా సదరం స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రోడ్డు ప్రమాదాలు, వివిధ కారణాలతో దివ్యాంగులుగా మారిన వారిని ప్రభుత్వం గుర్తించి తోడ్పాటునందించాలన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన రేపని మల్లేశ్ అనారోగ్యం కారణంతో కాలు కోల్పోయి మంచానికి పరిమితమయ్యాడు. సోమవారం ఎంపీడీవో సుజాత, స్థానిక నాయకులతో కలిసి మల్లేశ్‌ను శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కడ్తాల మండలంలో స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం లేని వారికి ఎంపీడీవో నివేదిక ఆధారంగా సదరం సర్టిఫికెట్లు అందించాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, మండలాధ్యక్షుడు రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



గౌరవ వందన స్వీకరిస్తున్న ఏసీపీ రంగస్వామి

తలకొండపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సై శ్రీకాంత్‌తో సమావేశమై కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. దొంగతనాల నిర్మూలనకు గ్రామాలు, దుకాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆమనగల్లు సీఐ బి.ప్రమోద్‌కుమార్, కడ్తాల్ సీఐ శివప్రసాద్, తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ తదితరులున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



అండర్ పాస్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల

ఘట్‌కేసర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రయాణికులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు.. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిలో సోమవారం పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ వద్ద జాతీయ రహదారిని దాటేందుకు అండర్‌పాస్ నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించారు. వాహనదారుల సౌకర్యార్థం అవకాశం ఉన్న చోట అండర్ పాస్ నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు గొంగల్ల మహేశ్, సింగిరెడ్డి సాయిరెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మహేశ్, జితేందర్‌నాయక్, సురేశ్‌నాయక్, రమేశ్ ముదిరాజ్, జవాజీ అశోక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చౌరస్తా విస్తరణకు సహకరించాలి



అంబేడ్కర్ చౌరస్తా సుందరీకరణ మ్యాప్‌ను చూపిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా విస్తరణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, వినాయక చౌరస్తాను సోమవారం విస్తరణపై ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్-బీజాపూర్, మహబూబ్‌నగర్-తాండూర్ ప్రధాన కూడలి అంబేడ్కర్ చౌరస్తా ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. ఇందుకు చౌరస్తా విస్తరణతో సుందరీకరించేందుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలన్నారు. వారి వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల పరిశీలన



ఆటోమెటిక్ వాతావరణ కేంద్రం పనితీరును పరిశీలిస్తున్న శివరాజ్

వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో చలి గాలుల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. జిల్లాలో మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) అధికారులు ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల పనితీరును పరిశీలించి చలి తీవ్రతను నమోదు చేస్తున్నారు.ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలను టీజీడీపీఎస్ అధికారి శివకుమార్ మహిపాల్‌తో కలిసి సోమవారం తెల్లవారుజామున 5 నుంచి 6 గంటల వరకు పరిశీలించారు. సైక్లోమీటర్ సహాయంతో ఉష్ణోగ్రతలను పరిశీలించగా, 13.6 డిగ్రీలు నమోదైంది. జిల్లాలో 29 అన్‌బ్లాక్ కేంద్రాలు ఉండగా, వీటి ద్వారా జిల్లాలో వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి దిశ, గాలి వేగం వంటివి తెలియనున్నాయి. జిల్లాలోని వాతావరణ కేంద్రంలో పనిచేసే సెన్సార్ల ఆధారంగా ఉష్ణోగ్రతల వివరాలు నమోదు కానున్నాయి.



మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్

ఇష్టారాజ్యం!

సమయపాలన పాటించని పలువురు అధికారులు

- అడిగితే ఫీల్డ్‌కు వెళ్లారంటూ సమాధానాలు
- అమల్లోకి రాని 'బయోమెట్రిక్'!
- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో పరిస్థితి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇష్టానుసారం కార్యాలయానికి వస్తూ అడిగితే ఫీల్డ్ పర్యటనకు వెళ్లామంటూ చెప్పడం పరిపాటిగా మారింది. ఇంత జరుగుతున్నా మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నేటికీ బయోమెట్రిక్ విధానం అమల్లోకి రావడం లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌ను తూంకుంట మున్సిపల్ అంతాయపల్లిలో జీ ప్లస్ టూ భవనంలో 86 గదుల్లో ఏర్పాటు చేశారు. అక్కడ కలెక్టర్‌తో పాటు ఇద్దరు అదనపు కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓ, డీఆర్‌ఓ, డీఆర్‌డీఓ, డీపీఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు దాదాపు 400 మంది విధులు నిర్వహిస్తున్నారు. సమయపాలన విషయమై చర్చకు రావడంతో కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆరు నెలల క్రితమే కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో కలెక్టరేట్ ఏఓ చర్యలు చేపట్టారు. ఈ విధానం ద్వారా ఉద్యోగుల హాజరు శాతాన్ని మెరుగుపర్చడంతో పాటు విధుల నిర్వహణ సక్రమంగా సాగుతుందని అందరూ భావించారు.

అన్ని చర్యలు తీసుకున్నా..

ప్రతీ రోజు ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకుని సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మధ్యలో అధికారులు ఫీల్డ్‌కు వెళ్లాల్సి వస్తే కార్యాలయం నుంచి వెళ్లే సమయం, వచ్చే సమయం కూడా బయోమెట్రిక్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్‌లో నాలుగు చోట్ల బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. ఈ మేరకు ఉద్యోగుల వివరాలను బయోమెట్రిక్ యంత్రాల్లో రికార్డు చేశారు. అధికారులు అన్ని చర్యలు తీసుకున్నప్పటికీ నేటికీ బయోమెట్రిక్ విధానం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని అలుసుగా తీసుకున్న కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా నడుచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాంకేతిక కారణాలతోనే ఆలస్యం

కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేసి ఓ సంస్థకు అప్పగించాం. సిబ్బంది వివరాలను కూడా బయోమెట్రిక్ మిషన్లలో రికార్డు చేయించాం. వేలిముద్రల విధానంలో సాంకేతిక కారణాల వలన ఆలస్యమవుతున్నట్లు పనులు అప్పగించిన సంస్థ వారు తెలిపారు. త్వరలోనే బయోమెట్రిక్ విధానాన్ని ప్రారంభిస్తాం. - **రామ్మోహన్, ఏఓ, కలెక్టరేట్**

సొంత పనులపై తిరుగుతూ..

ఆయా కార్యాలయాల్లో సదరు అధికారి కనిపించకపోవడంతో సార్ లేరా అని ప్రశ్నించిన వారికి ఫీల్డ్‌కు వెళ్లారనే సమాధానం సిబ్బంది నుంచి రావడం పరిపాటిగా మారింది. కొందరు అధికారులు ఫీల్డ్ పర్యటన వంకతో సొంత పనులపై తిరుగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విమర్శలకు చెక్ పెట్టాలంటే బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని వివిధ సమస్యలపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు కోరుతున్నారు.

పార్టీలు, ఈవెంట్లకు అనుమతులు తప్పనిసరి

శంకర్‌పల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసుల అనుమతి లేకుండా పార్టీలు, ఈవెంట్లు నిర్వహించరాదని శంకర్‌పల్లి, మోకిల సీఐలు శ్రీనివాస్‌గౌడ్, వీరబాబులు తెలిపారు. శంకర్‌పల్లిలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ న్యూయర్ వేడుకల్లో భాగంగా అనుమతి లేకుంగా రిసార్టులలో పార్టీలు, ఈవెంట్లు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించా రు. ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేశామన్నారు. మత్తు పదార్థాలు, గుట్కాలపై గట్టి నిఘా ఉంచామని, మద్యాన్ని చిన్నపిల్లలకు విక్రయించరాదని సూచించారు. న్యూయర్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, పెద్దపెద్ద శబ్దాలతో ఇతరులకు ఇబ్బందులు కలిగించరాదన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆమనగల్లు/కడ్తాల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు నిబంధనలకు లోబడి శాంతియుతంగా జరుపుకోవాలని ఆమనగల్లు, కడ్తాల సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్‌లు కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమనగల్లు, కడ్తాల పోలీసు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం సీఐలు విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో పోలీసు శాఖ పరంగా అన్ని ముందు జాగ్రత్తలు, బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వేడుకలను జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

- వికారాబాద్ కల్టెర్ ప్రతీక్ జైన్
- ప్రజావాణిలో 79 దరఖాస్తులు

వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం 79 దరఖాస్తులు రాగా, భూ సమస్యలు అధికంగా వచ్చినట్లు తెలిపారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కారం తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర ఉన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు: మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణిలో 123 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ శంకర్‌కుమార్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు

రైతులందరి వద్ద పత్తిని కొనుగోలు చేయాలి

- ఎన్నెపల్లి చౌరస్తాలో రైతుల నిరసన
- కలెక్టర్ చొరవతో శాంతించిన అన్నదాతలు

వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించిన పత్తిని కొనుగోలు చేయాలని రైతులు రోడ్డు ఎక్కి ధర్నా నిర్వహించారు. పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తాలో సోమవారం పత్తిలోడు ట్రాక్టర్లను అడ్డం పెట్టి ధర్నా చేశారు. అయ్యప్ప కాటన్‌మిల్‌లో రోజుకు 2వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తామని చెబుతున్నారని, మిగితా రైతుల పరిస్థితి ఏమిటని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేసి రోడ్డు పక్కకు జరపగా రైతులు అక్కడి నుంచి జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. దీంతో కలెక్టర్‌ను పలువురు రైతులు వెళ్లి కలవగా కలెక్టర్ కాటన్‌మిల్ నిర్వాహకులతో మాట్లాడి రైతుల పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఆదేశించారు. దీంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ టీ.వి హన్మంత్‌రావు

వికారాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని అదనపు ఎస్పీ టీవీ హన్మంత్‌రావు హెచ్చరించారు. డీపీవో కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ 11 కార్యక్రమంలో భాగంగా సోమవారం అనుబంధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో జనవరి 1 నుంచి 31 వరకు అధికారులు, పోలీసు, లేబర్, స్వచ్ఛందసంస్థలు, పిల్లల సంక్షేమ కమిటీ, చైల్డ్ లైన్ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసిబాల కార్మికులు లేకుండా కృషి చేయాలన్నారు. పిల్లల సంక్షేమ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, అన్వర్ పాషా, బీఆర్‌బీ కోఆర్డినేటర్ కాంతారావు, డబ్ల్యూసీడీ మెంబర్స్, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, ఏహెచ్‌టీయూ టీం సభ్యులు, లేబర్ డిపార్ట్మెంట్ సభ్యులు, ఆపరేషన్ స్మైల్‌టీం సభ్యులు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీకి ప్రజాదరణ

- సభ్యత్వ నమోదుకు విశేష స్పందన
- పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో టీడీపీకి ప్రజాదరణ పెరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నదని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అక్టోబరు 26న ప్రారంభమైన సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా లక్షా 21 వేల మంది తీసుకున్నారని తెలిపారు. గతంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనను చూసిన ప్రజలు తిరిగి టీడీపీ వైపు వస్తున్నారని, సుదీర్ఘ కాలం సీఎంగా పనిచేసి అపార అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు ఏపీలో ముఖ్యమంత్రిగా, టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఉండడం, తెలంగాణలో సైతం పార్టీ సభ్యత్వంపై దృష్టి పెట్టడంతో ప్రజలు ముందుకు వచ్చి, సభ్యులుగా చేరుతున్నారని చెప్పారు. ప్రజా స్పందన చూస్తుంటే తెలంగాణలో సైతం టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రకృతిని, వ్యవసాయ భూములను నాశనం చేసిందని విమర్శించారు. పేదలు పంటలు పండించి, బతకడానికి ఇచ్చిన భూములను సైతం లాక్కొని పరిశ్రమలకు ధారదత్తం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా పేదల భూముల జోలికి వెళ్లకుండా పంట పొలాలు, పర్యావరణాన్ని పరిరక్షించాలని బక్కని డిమాండ్ చేశారు.

హెచ్‌ఎంపై దాడి హేయం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్




హెచ్‌ఎం రాములును పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

మహేశ్వరం/కందుకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై అయ్యప్ప స్వాముల ముసుగులో దాడికి పాల్పడటం హేయమైన చర్య అని, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ అన్నారు. అయ్యప్ప మాలతో ఉన్న విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు కొట్టాడనే నెపంతో కొందరు అయ్యప్ప మాలదారులు పలువురు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం రాములుపై విచక్షణ రహితంగా దాడి చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. ఈమేరకు సోమవారం మీర్‌పేటలోని రాములు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అయ్యప్ప స్వాముల ముసుగులో కొందరు బీజేపీకి చెందిన వ్యక్తులు పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎంపై దాడి చేయడం సరికాదని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు చంద్రమోహన్, రామచందర్, కృష్ణ, పెంటయ్య, బాలరాజు, శేఖర్, కవిత తదితరులు ఉన్నారు. అలాగే హెచ్‌ఎంపై దాడి సరికాదని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ బషీర్ అన్నారు. రాములుపై దాడికి నిరసనగా సోమవారం పాఠశాల భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు సురేష్, గ్లోరి, కృష్ణ, విజయమోహన్‌రెడ్డి, శ్రావణి, కౌసల్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

చకచకా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కొత్తూర్/కందుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి కావొస్తుందని మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మున్సిపాలిటీ పరిధిలో 1857 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు సర్వే పనులు 95శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. త్వరలో వందశాతం సర్వే పూర్తి చేసి, యాప్‌లో పెడతామని కమిషనర్ బాలాజీ తెలిపారు. కందుకూరు మండలంలోని 35 గ్రామాలలో 15241 ఇళ్లకుగాను సోమవారం నాటికి 12945 ఇళ్లను సర్వే పూర్తి చేశామని ఎంపీవో గీత తెలిపారు. మండలంలో 84.94శాతం సర్వే పూర్తి చేశామని, మిగిలినవి రెండురోజుల్లో పూర్తిచేస్తామని, నేదునూర్‌లో 1119ఇళ్లకు గాను 1075 ఇళ్లసర్వే చేశామన్నారు. ప్రతి పేదకుటుంబానికి ఇళ్లను మంజూ రు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

యాసంగి సాగుకు సన్నద్ధం



కులకచర్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షాకాలం పంట నూర్పిడి, ధాన్యం కొనుగోలు పూర్తి కావడంతో రైతులు యాసంగి సాగులో భాగంగా వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేయడంలో బిజీబిజీగా ఉన్నారు. ఆశించిన దానికంటే ఎక్కువగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు బోర్లు, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. మండలంలోని 44 గ్రామ పంచాయతీల్లో యాసంగిలో 10500 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అధికారులు అంచనావేశారు.

ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

శంకర్‌పల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా.. డాక్టర్ ఖాదర్ వలి తెలిపారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో సోమవారం సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌ఎమెంట్-ఐనా(ఏఏఐఎన్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మిల్లెట్స్-ఆధునిక ఆరోగ్యం కోసం తెలివైన ఎంపిక అనే అంశంపై ఆయన ప్రసంగించారు. చిరుధాన్యాలను రోజువారి ఆహారంలో చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పోషకాలు అధికంగా ఉన్న పురాతన చిరుధాన్యాలు ఊబకాయం, డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో ఎంతగానో తోడ్పడతాయన్నారు. అమృత తుల్యమైన అంబలిని వదిలి శరీరానికి హాని కలిగించే టీ, కాఫీలను తాగడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సాంప్రదాయ ధాన్యాల కంటే చిరుధాన్యాలు తక్కువ వర్షపాతంతో పండుతాయని గుర్తు చేశారు. పాలు, చక్కెర, మాంసం, గుడ్డు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్పొరేట్ కంపెనీల మోజులో పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని హితవు పలికారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎల్.ఎస్. గణేష్, రిజిస్ట్రార్ డాక్టర్ విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్టు డాక్టర్ పి. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

200 ఎకరాల గిఫ్ట్ భూములు రైతులవే

● ఫైనల్ ఆర్డర్ ఇచ్చిన లోకాయుక్త



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులు

తాండూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేశ్‌ముఖ్‌లు (జాగీర్ దారులు) 52 ఏళ్ల క్రితం బీదలకు పంపిణీ చేసిన గిఫ్ట్ భూములు లబ్ధి పొందిన రైతులకే చెందాలని లోకాయుక్త ఫైనల్ ఆర్డర్‌ను జారీ చేసింది. దీంతో రైతులు ధరణిలో తమ భూములపై ఉన్న అభ్యంతరాలను తొలగించాలని రైతులు తాండూరు సబ్ కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. యాలాల మండలం బెన్నూర్ గ్రామంలో సుమారు 200 ఎకరాల సాగు భూములను 1954లో దేశ్‌ముఖ్‌లు బీదలకు భూములను పంపిణీ చేశారు. అయితే ఈ భూములపై తనకూ హక్కులు ఉన్నాయని 1972లో శరణ్ భూపల్ రెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. దేశ్‌ముఖ్‌కు చెందిన విజయ్ కుమార్ కోర్టుకు హాజరు కానీ కారణంగా శరణ్ భూపల్‌రెడ్డికి అట్టి భూములపై 1977లో ఇంజక్షన్ ఆర్డర్ లభించింది. దీంతో రైతులకు పంపిణీ చేసిన భూములకు సంబంధించి క్రయ విక్రయాలు జరుగకుండా నిలిచి పోయాయి. దీంతో 2022లో రైతుల తరుపున ఆ గ్రామానికి చెందిన గురురాజ్ జోషి లోకాయుక్త కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన లోకయుక్త ఆ భూములు గిఫ్ట్ ల్యాండ్ కింద పొందిన రైతులకే చెందాలని ఆర్డర్‌ను జారీ చేసింది. లోకయుక్తలో తమకు న్యాయం జరిగిందని బాధిత రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

పాంబండ ఆలయంలో ప్రత్యేక పూజలు



పాంబండ దేవాలయాన్ని దర్శించుకున్న పరిగి కోర్టు న్యాయాధికారి శిల్ప శివకృష్ణ దంపతులు

కులకచర్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ వెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని పరిగి కోర్టు న్యాయాధికారి శిల్ప శివకృష్ణ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. అమావాస్య సందర్భంగా దంపతులు ఆలయంలో పూజలు నిర్వహించారు. అర్చకులు పాండుశర్మ పూజల అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మైపాల్‌రెడ్డి వారికి స్వాగతంపలికి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు

శామీర్‌పేట: శామీర్‌పేటలోని శ్రీభవానిరామలింగేశ్వర స్వామి ఆలయం(శివాలయం)లో ఆదివారం రాత్రి మాసశివరాత్రి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఘుధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం, అర్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. శామీర్‌పేట చెందిన భజన మండలి బృందం ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం భక్తుల సహకారంతో అన్నదానం చేశారు. అదేవిధంగా శామీర్‌పేటలోని శ్రీభవానీ రామలింగేశ్వర్‌స్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మణవేదపండితుడు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో సోమావతి అమావాస్య పూజలను పెద్దఎత్తున నిర్వహించారు.

'ప్రిన్సిపల్ స్వప్రయోజనాల కోసమే కళాశాల తరలింపు'

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపల్ నిరూప స్వప్రయోజనాల కోసం బీబీనగర్ మండలం, లక్ష్మీదేవి గూడెం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ ఆర్మ్డ్ ఫోర్సెస్ డిగ్రీ కళాశాలను ఘట్‌కేసర్ మండలం, అంకుశాపూర్‌కు తరలించారని ఆరోపిస్తూ విద్యార్థినులు సోమవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మహేంద్రహిల్స్)లో ఇప్పటికే 550 మంది విద్యార్థినులు ఉన్నారని, మరి ఆర్మ్డ్ ఫోర్సెస్ ప్రీపరేటరి కళాశాలకు చెందిన 350 మంది విద్యార్థినులను ఇక్కడికి తరలిస్తే ఇంతమంది కలిసి ఎలా చదువుతారని ప్రశ్నించారు. తనకు సౌకర్యంగా ఉంటుందని ప్రిన్సిపల్ లక్ష్మీదేవిగూడ నుంచి ఆర్మ్డ్ ఫోర్సెస్ కళాశాలను హైదారాబాద్‌కు సమీపంలో ఉన్న అంకుశాపూర్‌కు తరలించారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా యాదాద్రి జిల్లా నుంచి మేడ్చల్‌కు ఎలా తరలిస్తారని వాపోయారు. ఇక్కడ సౌకర్యాలు సక్రమంగా లేవని నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్మ్డ్ ఫోర్సెస్ ప్రీపరేటరి కళాశాలను తిరిగి లక్ష్మీదేవిగూడకు పంపించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు.

నూతన ఎస్ఐకి సన్మానం



ఎస్ఐను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బంట్వారం(కోట్‌పల్లి), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతనంగా కోట్‌పల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గఫార్‌ను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందర్ అనిల్, నాయకులు వెంకటేశ్ యాదవ్, మల్లయ్య, రామ్ చందర్, కృష్ణ, వెంకటయ్య, పెంటారెడ్డి, కొండల్‌రెడ్డి, మహేందర్, నర్సింహులు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన కమిటీ

యాలాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు మండల నూతన కమిటీని సోమవారం ఏర్పాటు చేసినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ చెరుకు రాంచందర్ ఆధ్వర్యంలో సోమవారం ఈ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా ఎం.నరేష్, ఉపాధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, కె.నర్సింహులు, సాయిలు, ప్రధాన కార్యదర్శిగా ఎం.నర్సింహులు, అశోక్, కార్యదర్శిగా ఎం.కృష్ణ, వెంకటయ్య, సలహాదారులుగా వెంకటయ్య, అమతప్ప, తిమ్మప్ప, బలరాం లను ఎన్నుకున్నారు.

పాత పనుల పరిశీలన

బషీరాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రూ.లక్షల వ్యయంతో గతేడాది వివిధ పథకాల కిందట చేపట్టిన అభివృద్ధి పనులను బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ ఆదేశానుసారం ఆయా గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీరోడ్లను పరిశీలించారు. అనంతరం బషీరాబాద్‌లోని ఎస్సీ బాలురు వసతి గృహంలో రూ.6లక్షల ప్రత్యేక నిధులతో పనులు చేపట్టగా ఎంపీడీవో పరిశీలించి వార్డెన్ రాజేశ్వర్‌తో చర్చించారు. వివరాలు నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

యాలాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దాయిపేట్‌లో సోమవారం రాత్రి కళాజాత బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు యాలాల ఎస్ఐ గిరి తెలిపారు. ఆపద సమయంలో డయల్ 100 సేవలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం కళాజాత బృందం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అవుషాపూర్‌లో దొంగల హల్‌చల్

● ఓ ఇంట్లో 20 తులాల బంగారం, నగదు అపహరణ
● మరో ఇంట్లో 15గ్రాముల బంగారం, 15తులాల వెండి, నగదు చోరీ



అవుషాపూర్‌లో దుండగులు పగులగొట్టిన ఇంటి తాళం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు పట్టపగలే రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అవుషాపూర్‌కు చెందిన కొట్టి రవీందర్‌రెడ్డి కుటుంబసభ్యులు సోమవారం స్థానిక ఓగార్డెన్‌లో జరిగిన తమ సమీప బంధువుల దావత్‌కు వెళ్లారు. రవీందర్‌రెడ్డి మధ్యాహ్నం 3గంటలకు అవుషాపూర్‌లోని తన వ్యక్తిగత కార్యాలయానికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఇంటితాళం పగులగొట్టి బీరువాలోని 20తులాల బంగారు ఆభరణాలు, రెండున్నర లక్షల నగదును ఎత్తుకెళ్లారు. సాయంత్రం రవీందర్‌రెడ్డి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. దీంతో రవీందర్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు.

మరో ఘటనలో..

అవుషాపూర్ న్యూసిటీ కాలనీలో మరో ఇంట్లో దుండగులు చొరబడి బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి కాలనీకి చెందిన రమావత్ రమేష్, అతడి భార్య ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటారు. వారు ఆఫీసుకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 15గ్రాముల బంగారం, 15తులాల వెండి ఆభరణాలతో పాటు ఆరువేల నగదును అపహరించుకెళ్లారు. రమేష్ ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగుల గొట్టి ఉంది. చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు క్లూస్‌టీం రప్పించి రెండు ఇళ్లలో జరిగిన చోరీలను పరిశీలించి, సీసీపుటేజీని సేకరించారు. ముగ్గురు నిందితులు బైక్‌పై వెళ్తున్నట్లు గుర్తించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దుండగులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

బదిలీల్లో బేరసారాలు!

(5వ పేజీ తరువాయి)

పని చేస్తున్నారు? ఏ జిల్లాలో ఏయే మండలాలకు వెళ్లాలనుకుంటున్నారనే సమాచారం పోస్టు చేసి తమకు మ్యూచువల్‌గా వచ్చే వారి కోసం అన్వేషిస్తున్నారు. మ్యూచువల్ బదిలీల్లో వికారాబాద్ జిల్లా నుంచి మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు తమ సొంత జిల్లాలకు వెళ్లాలనుకునే ఉపాధ్యాయులు ఇప్పటికే తమకు మ్యూచువల్ కోసం ఏ ఉపాధ్యాయుడు సరైన వారనేది ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

ఈ బదిలీల విషయంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే ఉపాధ్యాయులకు, ఆ జిల్లాల నుంచి ఈ జిల్లాకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఉపాధ్యాయులకు మధ్య కొందరు ఉపాధ్యాయులు కమీషన్ మాటున తామే పెట్టుబడి పెట్టి మరీ మధ్యవర్తిత్వం చేస్తున్నట్లు చెబుతున్నారు. జీవో 317 కారణంగా నివాస ప్రాంతాలు, కుటుంబాల నుంచి దూరంగా వికారాబాద్ జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులు తాము కోరుకుంటున్న ప్రాంతాలకు పరస్పర బదిలీ ద్వారా వెళ్లడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచి వికారాబాద్ జిల్లాకు కేటాయించిన ఉపాధ్యాయుల్లో చాలా వరకు మ్యూచువల్ బదిలీలపైనే ఆశలు పెట్టుకున్న విషయం తెలిసిందే.

స్పష్టత లేక మ్యూచువల్ వైపే మొగ్గు

రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులతో పాటు భార్యాభర్తలు ఒకేచోట పనిచేసే విధంగా స్పౌజ్ బదిలీలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి అనుమతించింది. శస్త్ర చికిత్సలు జరిగిన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారి బదిలీల స్పష్టత ఉన్నా.. భార్యాభర్తల బదిలీల విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు. ఈ కేటగిరీలో సబ్జెక్టు ఖాళీలు ఉంటేనే స్పౌజ్ బదిలీలకు అనుమతిస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వం కల్పించిన మ్యూచువల్ బదిలీ అవకాశాన్ని వినియోగించుకోవాలన్న ఆలోచనతో కొందరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇచ్చుపుచ్చుకునేవే ఎక్కువగా..

వికారాబాద్ జిల్లా నుంచి రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు వెళ్లడానికి ముందుకు వచ్చిన ఉపాధ్యాయులు ఇక్కడకు వచ్చే ఉపాధ్యాయులకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు గుడ్‌విల్ ఇచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు చెబుతున్నారు. హెచ్ఆర్ఏ, పోస్టింగ్ ప్రాంతం ఆధారంగా ఈ గుడ్‌విల్ ఆఫర్‌లో హెచ్చుతగ్గులు ఉంటున్నట్లు తెలుస్తోంది. ఎస్జీటీలు, స్కూల్ అసిసెంట్లు ఒకే కేడర్ ఉండాలి. స్కూల్ అసిస్టెంట్లలో సేమ్ సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లభించడం కష్టతరం కావడంతో అలాంటి వారికి అడిగినంత ఇచ్చే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. మ్యూచువల్ బదిలీల్లో 20 శాతం వరకు ఉపాధ్యాయులు ఆశించకుండానే అంగీకరిస్తుండగా, మిగతా 80 శాతం మాత్రం పెద్ద ఎత్తున బేరసారాలకు దిగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మ్యూచువల్ బదిలీల్లో చాలా వరకు ఇచ్చి పుచ్చుకునేవే ఎక్కువగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ జిల్లా నుంచి కర్ణాటకకు ఆనుకుని ఉన్న వికారాబాద్ జిల్లాలోని ఓ మారుమూల మండలానికి వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్న ఓ ఉపాధ్యాయు డికి ఇప్పటి వరకు అత్యధికంగా రూ.21 లక్షలు ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. బదిలీలకు గడువు రేపు ఒక్కరోజే ఉండడంతో ఈ ఆఫర్ మరింత పెరిగే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

నిబంధనలు పాటించాలి



శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫామ్‌హౌజ్‌లు, రిసార్ట్స్‌ను తనిఖీలు చేస్తున్న సీఐ శ్రీనాథ్

మూడుచింతలపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రిసార్ట్స్, ఫామ్ హౌజ్ లో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించే నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాలని శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్ అన్నారు. డిసెంబర్ 31 వేడుకల్లో భాగంగా శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రిసార్ట్స్, ఫామ్ హౌజ్‌లను సోమవారం తనిఖీలు చేశారు. డీజేలు నిషేధమని, మద్యం మత్తులో వాహనాలు నడపొద్దన్నారు. వేడుకలు రాత్రి 12.30గంటల వరకు పూర్తికావాలని తర్వాత కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు.

దౌల్తాబాద్/మోమిన్‌పేట్: నూతన సంవత్సర వేడుకల్లో పోలీసు నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని దౌల్తాబాద్, మోమిన్‌పేట్ ఎస్సైలు రవిగౌడ్, మోమిన్‌పేట్ సీఐ నవీన్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో వేర్వేరుగా తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో డీజే సౌండ్ బాక్సులకు అనుమతి లేదన్నారు. రిసార్ట్, ఫాం హౌస్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఉదయం వరకు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నాకాబందీ, వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు

కీసర రూరల్: నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సోమవారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. వేడుకల పేరుతో ప్రజా జీవనానికి ఎలాంటి భంగం కలిగించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవించినా, వేడుకలు నిర్వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

పూడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి సాంఘికశాస్త్రం టాలెంట్ టెస్ట్‌సోమవారం జరిగింది. ఈ టెస్ట్‌లో మండల పరిధిలోని కంకల్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.ప్రకాష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించాడు. హెచ్ఎం పుష్ప, ఉపాధ్యాయులు చంద్రమోహన్, మల్లేశ్వరిల అభినందించారు.

పెద్దేముల్: సాంఘికశాస్త్రం పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందని పెద్దేముల్ మండల విద్యాధికారి నర్సింగ్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర పాఠశాలలో సోమవారం సోషల్‌ఫోరం ఆధ్వర్యాన విద్యార్థులకు మండలస్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ సోషల్‌ఫోరం జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్, ఇన్‌చార్జి హెచ్ఎం నరేందర్‌రెడ్డి, అంజయ్య, సంధ్యారాణి, అనురాధ, విజయ్‌కుమార్, అశోక్, మురళి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్టు నిర్వహించారు. మండల సోషల్ ఫోరమ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్, అజ్మత్‌ల ఆధ్వర్యంలో టెస్టు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో హబీబ్ అహ్మద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, భాస్కర్, వెంకటయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పరిగి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వాఖ్యలను నిరసిస్తూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మహేందర్, డివిజన్ కార్యదర్శి మల్లేశ్‌లు మాట్లాడుతూ.. కేంద్రమంత్రి అమిత్‌షాను దేశం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ మేధావి,రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలియని మూర్ఖుడు అమిత్‌షా అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్, మల్లేశ్, మాణిక్యం, శేఖర్, చందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కులకచర్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ బీఎస్.ఆంజనేయులు తెలిపారు. మండలంలోని పాంబండ ఆలయ ఆవరణలో సోమవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, ఆలయ కమిటీ ఛైర్మన్ మైపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, మహిళా కార్యదర్శులు అనురాధ, మౌనిక, రాష్ట్ర బాధ్యులు పెంటయ్య, జైపాల్‌రెడ్డి, సతీశ్, తావుర్యానాయక్, శ్రీశైలం, కృష్ణయ్య, శరత్‌కృష్ణ పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

పరిగి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుంకులగడ్డలో రూ.2కోట్లతో నిర్మించనున్న బంజారా భవనానికి ఈనెల 15వ తేదీన రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలు కలిసి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనపై వార్డు కౌన్సిలర్ జె.శ్రీవినాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అకతాయిల పనా? కావాలనే ధ్వంసం చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు

బషీరాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డులో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కర్ణాటకకు చెందిన ఓయువకుడు బైక్‌పై తాండూరు నుంచి బషీరాబాద్ వైపు వస్తున్నాడు. కాశీంపూర్ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో బండరాయికి బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడి తల, నడుముకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యూ.రమేష్‌కుమార్, భద్రేశ్వర్ అతన్ని అంబులెన్స్‌లో తాండూరు జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం పంపించారు.

ఫోన్ దొంగను పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు

వికారాబాద్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఫోన్ దొంగలించి పారిపోతున్న దొంగను ట్రాఫిక్ హోంగార్డు పోలీసులు వెంబడించి పట్టుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బీజేఆర్ చౌరస్తా సమీపంలో ఓ వ్యక్తి ఫోన్ మాట్లాడుతుండగా ఓదొంగ చేతుల్లో నుంచి ఫోన్ లాక్కొని పరుగులు తీశాడు. ఆ సమయంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు కృష్ణ, ఎల్లయ్యలు గమనించి దొంగను వెంబడించి రైల్వేస్టేషన్ మార్గంలో చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం దొంగను వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

రిసార్ట్‌పై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డీజే, మద్యం అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వాహకుడు, రిసార్ట్ యజమానిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అవుషాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఎంఎస్ఆర్ రిసార్ట్‌లో కార్తిక్ తన బర్త్‌డే సందర్భంగా తన మిత్రులతో పార్టీ ఏర్పాటుచేశారు. డీజే సౌండ్ ఏర్పాటు చేసుకొని మద్యం తాగుతూ న్యూసెన్స్ చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు రిసార్ట్‌పై దాడిచేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం, డిజే సౌండ్ ఏర్పాటు చేశారని ఈవెంట్ నిర్వాహకుడు కార్తిక్‌తో పాటు రిసార్ట్ యజమాని మధుసూదన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దేముల్, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన దేవుజా(55)తన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. ఆదివారం తాను ఒక్కడే పనిమీద గిర్మాపూర్ గ్రామానికి వచ్చాడు. సోమవారం ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశాక కేసునమోదు చేసుకుని విచారణ చేపడతామని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి..

మేడ్చల్ టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26న మేడ్చల్‌లో 30నుంచి 35 వయస్సు గల వ్యక్తి అపస్మారకస్థితిలో ఉండటాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కీసర రూరల్, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను కీసర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన కరణ్‌సింగ్ కుషాయిగూడలో నివాసముంటూ రాజ్‌పుత్‌దాబాలో అతడి మిత్రుడు రాకేష్‌మంజు బార్సిలాల్ రెయిలింగ్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. జల్సాలకు బానిసైన వారు మత్తుపదార్థాల విక్రయాలను ఎంచుకున్నారు. అందులో భాగంగా వారు పాప్పిస్టా మత్తుపదార్థాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కీసర పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా కీసర మండలంలోని యద్గార్‌పల్లి వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.2కేజీల పాప్పిస్టా మత్తు పదార్థాన్ని, రెండుఫోన్లు, టాటా ఏస్ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఓవ్యక్తిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యూపీకి చెందిన చందన(37) నగరంలోని నేరేడ్‌మెట్‌లో నివాసముంటున్నాడు. సోమవారం చర్లపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న యాక్టీవాను ఆపి తనిఖీ చేయగా అందులో రెండు కిలోల గంజాయి లభించింది. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చందన సొంత రాష్ట్రం వెళ్లి వచ్చినప్పుడల్లా గంజాయి తీసుకొచ్చి కాప్రా మండల పరిధిలో విక్రయిస్తున్నట్లు తెలిపాడు. ఈ మేరకు గంజాయితో పాటు యాక్టీవాను స్వాధీనం చేసుకొని సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి ఏడాది జైలు

పూడూరు, డిసెంబరు 30, (ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ పరిగి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగుల స్వప్న తీర్పు చెప్పినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. మండలంలోని చెన్‌గోముల్‌కు చెందిన ఎం.రాంచంద్రారెడ్డి, సత్తార్‌ఖాన్‌లు కలిసి తనను చీటింగ్ చేశారంటూ అంగడిచిట్టెంపల్లికి చెందిన షకీల్(ఖాజామునిరుద్దీన్ అహ్మద్) అప్పట్లో ఎస్ఐ మక్బూద్ అలీకి ఫిర్యాదుచేశాడు. అప్పటి ఎస్ఐ చార్జీషీట్ వేయగా ఎస్పీ నారాయణరెడ్డి పర్యవేక్షణలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మధుసూదనరెడ్డి తదితరులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం కోర్టు ఇన్‌చార్జి ఆఫీసర్ వీరన్న, ఎస్ఐ మధుసూదనరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ శివకుమార్ కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వపరాలు విన్న మెజిస్ట్రేట్ నిందితులకు ఒక సంవత్సరం జైలుశిక్ష, రూ.6వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

అర్ధరాత్రి బాలుడి కిడ్నాప్

తాండూరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తల్లిఒడిలో నిద్రిస్తున్న బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన తాండూరు మండలం గౌతాపూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్‌కు చెందిన భాషా, గోర్‌బీ దంపతులకు షమీనా, ఇమామ్, ముఖ్దుం, రజని, హుస్సేన్(1) సంతానం ఉన్నారు. అయితే గౌతాపూర్ గ్రామానికి ఇటీవల వలస వచ్చారు. గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయం ఆవరణలో ఉంటూ గ్యాస్‌స్టవ్ రిపేర్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఆలయ ఆవరణలో పిల్లలతో కలిసి నిద్రించారు. గోర్‌బీ తన ఏడాది కుమారుడు హుస్సేన్‌ను పక్కనే చీర కొంగుకు కట్టుకుని నిద్రించింది. తెల్లవారుజామున లేచి చూసేసరికి హుస్సేన్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల మొత్తం వెతికారు. అయినా కనిపించకపోవడంతో కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి గౌతాపూర్ గ్రామాన్ని చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా బాలుడి ఆచూకీని త్వరలోనే గుర్తిస్తామని ఎస్ఐ తెలిపారు.

తల్లీకూతుళ్లు అదృశ్యం



తల్లి రేణుక



చిన్నారి శ్రీలత

పెద్దేముల్, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): కూతురితో కలిసి ఆస్పత్రికి వెళ్లిన తన భార్య తిరిగి ఇంటికి రాలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆత్కూర్ తాండకు చెందిన కేతావత్ రేణుక(24) అనారోగ్యంతో ఉండగా ఈనెల 29న ఉదయం ఆస్పత్రికి వెళ్లివస్తానని ఇంట్లోచెప్పి వెళ్లింది. తనతో పాటు ఆరు సంవత్సరాల తన కూతురు శ్రీలతను కూడా వెంటపెట్టుకుని వెళ్లింది. ఆమె భర్తకు పొలం పనులు ఉన్నందున వెంటవెళ్లలేదు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూస్తే తన భార్య ఆస్పత్రి నుంచి రాలేదు. మరుసటి రోజు కూడా రాకపోవడంతో బంధువులు, తెలిసినవారందరి వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త కేతావత్ నరేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

జగ్గంగూడలో వ్యక్తి..



వెంకటేశ్

మూడుచింతలపల్లి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం కమాలాబాద్‌కు చెందిన బోయిని వెంకటేశ్ (45) నవంబరు 27వ తేదీన మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలోని తన కూతురు ఇంటికి వచ్చారు. మరుసటి రోజు ఉదయం కాలకృత్యాలు తీర్చుకొని వస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఆయన సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో పరిసరాలు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ప్రమాదవశాత్తు కంది పంట దగ్ధం

బొంరాస్‌పేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కంది పంట దగ్ధమైన ఘటన బొంరాస్‌పేట్ మండలంలో చోటుచేసుకుంది. మద్దిమడుగు తండాకు వెళ్లే దారిలో ఉన్న పొలంలో సోమవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికుడు దప్పులయ్యకు చెందిన రెండెకరాల కంది పంట అగ్నికి ఆహుతైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.